## క్లుప్తంగా

### 'చెరువుల పండుగను బహిష్కరిస్తాం'



మాట్లాడుతున్న గ్రామస్తులు

దండేపల్లి: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8న నిర్వహించే చెరువుల పండుగ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు దండేపల్లి మండలం అల్లీపూర్ గ్రామస్తులు ప్రకటించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తులు మంగళవారం సమావేశం అయ్యారు. గ్రామ చెరువు ఆక్రమణకు గురవుతుందని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, చెరువును పరిరక్షించనప్పుడు చెరువుల పండుగ ఎందుకని ప్రశ్నించారు?. చెరువుల పండుగలో భాగంగా నిర్వహించే కట్ట మైసమ్మ పూజలు, చెరువు నీటి పూజల్లో గ్రామస్తులు ఎవరూ కూడా పాల్గొనబోమని తేల్చి చెప్పారు.

### పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల మండల విద్యావనరుల కేంద్రం(ఎమ్మార్సీ) నుంచి మంగళవారం పాఠశాలల ఉపాధ్యాయులకు పుస్తకాలు అందజేశారు. రెండు రోజుల క్రితం బుక్ డిపో నుంచి ఎమ్మార్సీలకు పాఠ్యపుస్తకాలు సరఫరా చేశారు. పాఠశాల పునఃప్రారంభం నాటికి పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందజేస్తామని ఎంఈవో పోచయ్య తెలిపారు.

### 'పార్క్‌ల్లో అసాంఘిక పనులు చేయొద్దు'



పార్క్‌లో యువకులతో మాట్లాడుతున్న సీఐ

చెన్నూర్: మానసిక ప్రశాంతత, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం ప్రజలు పార్క్‌కు వస్తుంటారని, యువకులు పార్క్‌ల్లో అసాంఘిక పనులు చేయొద్దని సీఐ వాసుదేవరావు హెచ్చరించారు. చెన్నూర్‌లోని కేసీఆర్ పార్క్ ను మంగళవారం రాత్రి ఆయన సందర్శించారు. పార్క్‌లో ఉన్న యువకుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. పార్క్‌కు వచ్చే మహిళలను గౌరవించాలని, వారి పట్ల మర్యాదగా ఉండాలన్నారు. పార్క్‌లో వెకిలిచేష్టలు చేస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### 'భాగ్యనగర్' ఆలస్యం

మందమర్రిరూరల్: సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వరకు నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం నాలుగున్నర గంటలు ఆలస్యమైంది. సికింద్రాబాద్‌లో సాయంత్రం 3–20గంటలకు స్టార్ట్ కావాల్సిన ట్రైన్ 7–50గంటలకు స్టార్ట్ అయ్యింది. మందమర్రికి ఎనిమిది గంటలకు చేరుకోవాల్సి ఉండగా, 1–50కి వచ్చే అవకాశం ఉండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

### హన్‌మాన్ ఆలయానికి విరాళం

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాలలో హన్‌మాన్ ఆలయ ప్రహరీ నిర్మాణం కోసం శ్రీ శివసాయి గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో రూ.10వేలు విరాళం అందజేశారు.

### కూరగాయల ధరలు

| కూరగాయలు | ధర(కిలో) |
|---|---|
| టమాట | రూ.40 |
| పచ్చిమిర్చి | 60 |
| వంకాయ | 40 |
| కాకరకాయ | 70 |
| బెండకాయ | 40 |
| అలసంద | 40 |
| దొండకాయ | 70 |
| సోరకాయ | 30 |
| ఆకుగోబి | 50 |
| పూగోబి | 60 |
| క్యారెట్ | 60 |
| క్యాప్సికం | 90 |
| పాలకూర | 40 |
| తోటకూర | 40 |
| ములక్కాయ | 90 |

\- మంచిర్యాలఅగ్రికల్చర్



# రారండోయ్.. మా బడికి

- ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల ప్రచారం
- ఫ్లెక్సీలు, కరపత్రాలతో అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

దండేపల్లి: ప్రైవేటు పాఠశాలల పోటీని తట్టుకునేందుకు ప్రభుత్వ పాఠశాలల సిబ్బంది కూడా దీటుగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించడంతో పాటు, ఇంటింటికీ వెళ్లి మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకే పంపాలనీ, విద్యార్థులను, తల్లిదండ్రులను కలిసి కోరుతున్నారు.

**ఫ్లెక్సీలు, కరపత్రాలతో..**

బడిబాటలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల వారు ప్రైవేటుకు దీటుగా గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఖర్చుతో కూడుకున్న ఫ్లెక్సీలు, కరపత్రాలు ముద్రిస్తున్నారు. అందులో ఇటీవల పదోతరగతిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థుల ఫొటోలు ముద్రించి, వాటితో ర్యాలీలు తీయడంతో పాటు, అక్కడక్కడా ఫ్లెక్సీలు ప్రదర్శనగా కట్టారు. ఫ్లెక్సీల్లో టాపర్లుగా నిలిచిన వారి ఫొటోలతో పాటు తమ పాఠశాల ప్రత్యేకతలు తెలియజేస్తున్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో మీ పిల్లలకు ఉత్తమ విద్యాబోధన, మంచి ఫలితాలు మా పాఠశాలలో ఉన్నాయి. మా పాఠశాలలో చేరిన విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, సన్నబియ్యంతో కూడిన మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు ఉన్నాయని తల్లిదండ్రులకు, విద్యార్థులకు వివరిస్తూ పిల్లలను బడిలో చేర్పిస్తున్నారు.

**జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల అడ్మిషన్లు..**

జిల్లా విద్యాశాఖ అధికారి పరిధిలో 762ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, జూన్ 3 నుంచి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహిస్తూ, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. బడిబాట ప్రారంభం అయినప్పటి నుంచి జిల్లాలో ఇప్పటివరకు ఒకటో తరగతిలో 752అడ్మిషన్లు రాగా, 2వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు 613అడ్మిషన్లు వచ్చినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. అందులో ఒకటో తరగతిలో ఫ్రెష్ అడ్మిషన్లు కాగా, మిగిలిన తరగతుల అడ్మిషన్లు, ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల నుంచి వచ్చినవిగా పేర్కొన్నారు.




పాఠశాల ఎస్సెస్సీ టాపర్లతో ఫ్లెక్సీ

# మాట కలుపుతూ.. మోసం చేస్తూ!

- సైబర్ నేరస్తుల కొత్త పంథా
- పల్లె ప్రజలే టార్గెట్
- అప్రమత్తంగా ఉండాలంటున్నా పోలీసులు



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై

కోటపల్లి: సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. అమాయకులే లక్ష్యంగా దాడి చేస్తున్నారు. వీడియోకాల్ చేసి కవ్విస్తూ, మోసాలకు పాల్పడుతున్నారు. సులభంగా డబ్బులు వస్తున్నాయని ఆశపడ్డ అమాయకులు నిండా మునుగుతున్నారు. లింక్‌లు పంపి, ఖాతాల్లో ఉన్న సొమ్మును కాజేస్తున్నారు. ఓటీపీలు పంపి ఉన్నదంతా ఊడ్చేస్తున్నారు.

**లింక్‌లు పంపి.. ఖాతాలు ఖాళీచేసి**

అపరిచిత నంబర్ల నుంచి కాల్‌చేసి లింక్‌లు పంపుతూ, అమాయకులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఇటీవల షాపింగ్ వెబ్‌సైట్ల పేరిట ఆఫర్లు ప్రకటిస్తూ, ప్రజలను ఆకర్షిస్తున్నారు. ఆఫర్లకు ఆకర్షితులైన వారు షాపింగ్ చేసి డబ్బులు ఆన్‌లైన్‌లో చెల్లిస్తున్నారు. అయితే ఇక్కడి వరకు సక్రమంగానే జరిగే వ్యవహారం డబ్బులు చెల్లించిన తర్వాత ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ మాయమవుతుంది. ఇలాంటి ఘటనలు జిల్లాలో ఇప్పటికే రెండు, మూడు జరిగాయి.

**అవగాహన కల్పిస్తున్న పోలీసులు...**

అపరిచిత వ్యక్తులు కాల్ చేసి ఓటీపీలు అడిగితే చెప్పొద్దని పోలీసులు చెబుతున్నారు. తెలియని లింక్‌లు వస్తే అసలే ఓపెన్ చేయొద్దని కోరుతున్నారు. కొత్త నంబర్ల నుంచి వీడియోకాల్స్ వస్తే మాట్లాడొద్దని సూచిస్తున్నారు. ఏటీఎం సౌకర్యం లేని ప్రాంతాల్లో బ్యాంక్ ఖాతాదారుల వేలిముద్ర వేసి ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టమ్(ఏఈపీఎస్) ద్వారా రోజుకు రూ.10వేలు డ్రా చేసుకునే అవకాశం ఉంది. అయితే ఈ అవకాశాన్ని కూడా సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. వేలిముద్రలు వేసేటప్పుడు జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత వేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

- ఇటీవల కాలంలో ఆలుగామలో మీ సేవా నిర్వాహకుడు జనగామ గ్రామానికి చెందిన వ్యక్తి ఆధార్‌కార్డు నంబర్‌తో వేలిముద్ర సాయంతో అతడి బ్యాంక్ ఖాతా నుంచి సదరు వ్యక్తికి తెలియకుండానే అకౌంట్ నుంచి 4వేల రుపాయలు కాజేసిన విషయం తెలుసుకున్న సదరు వ్యక్తి పోలీసులను ఆశ్రయించారు.
- మండలంలోని అన్నారానికి చెందిన యువకుడికి కొత్త నంబర్ నుంచి కాల్ వచ్చింది. బ్యాంక్ డిటేయిల్స్ చెప్పండని, యువకుడి వివరాలు తీసుకోగా అతడు వివరాలు అన్నీ చెప్పాడు. కాల్ కట్ కాగానే, అతడి అకౌంట్‌లో ఉన్న రూ.20వేలు కోల్పోయినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇలా మండలంలో మారుమూల ప్రాంతాల ప్రజలే టార్గెట్‌గా సైబర్ నేరాలు జరుగుతుండగా పోలీసులు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

### అప్రమత్తంగా ఉండాలి



అప్రమత్తతతోనే సైబర్ నేరాలు నియంత్రించవచ్చు. ఇప్పటికే గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. సైబర్ మోసానికి గురైతే 1930లో ఫిర్యాదు చేయాలి. మోసపోయిన తర్వాత బాధపడే కంటే, ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం మేలు.

\- వెంకట్, ఎస్సై కోటపల్లి

# చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసాలు

- గర్భిణులకు సీమంతాలు
- పౌష్టికాహారం తీసుకోవాలని అవగాహన



అన్నప్రాసన చేయిస్తున్న జిల్లా సంక్షేమాధికారి



జిల్లా కేంద్రంలో సీమంతం చేస్తున్న వార్డు కౌన్సిలర్

దండేపల్లి: అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంలో భాగంగా దండేపల్లి ధర్మరావుపేటలో మంగళవారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య, సీడీపీవో రేష్మా, పాల్గొని, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలు, గర్భిణులకు సీమంతాలు, నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణల్లో మొక్కలు నాటారు. సూపర్‌వైజర్లు వాణి, వెంకటలక్ష్మి, సర్పంచ్ దేవక్క, ఎంపీటీసీ శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీల్లో సీమంతాలు**

మంచిర్యాలటౌన్: అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంలో భాగంగా పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. పద్మశాలికాలనీలో ఆ వార్డు కౌన్సిలర్ మెరుగు మహేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, సత్యవతి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. 11వ వార్డులోని ఏసీసీ 3అంగన్‌వాడీ కేంద్రంలో వార్డు కౌన్సిలర్ జోగుల శ్రీలత ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం చేసి, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఎస్.పద్మ, సహాయకురాలు లత పాల్గొన్నారు.

జన్నారం: మండలంలోని ఇందన్‌పల్లి సెక్టార్‌లోని 13అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేయించారు. కార్యక్రమంలో టీచర్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ బడిబాట

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుద్దాల, కాచన్‌పల్లి, తుర్కపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రంలో కిష్టంపేట సెక్టార్ సూపర్‌వైజర్ మాధవి ఆధ్వర్యంలో మంగళవారం అంగన్‌వాడీ బాట, గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన, న్యూట్రీగార్డెన్ కార్యక్రమాలు నిర్వహించారు. న్యూట్రీగార్డెన్‌లో భాగంగా తక్కువ ఖర్చుతో, ఎక్కువ పోషకాలు ఉన్న ఆహారం ఎలా తీసుకోవాలో తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రోజా, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

**బెల్లంపల్లి బస్తీలో బడిబాట**

బెల్లంపల్లిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని బెల్లంపల్లి బస్తీలో మంగళవారం బడిబాట కార్యక్రమం చేపట్టారు. బస్తీ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్యా, కల్పిస్తున్న వసతులను క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



సుద్దాల అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో...

# కేసీఆర్ సభ విజయవంతం చేయండి

- మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు



మాట్లాడుతున్న దివాకర్‌రావు

శ్రీరాంపూర్: నస్పూర్‌లో ఈ నెల 9న జరిగే కేసీఆర్ బహిరంగసభను విజయవంతం చేయాలని మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. ఆర్కే న్యూటెక్ గనిపై మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. 9న నస్పూర్‌లోని నూతన కలెక్టరేట్ భవనం ప్రారంభించడానికి కేసీఆర్ వస్తున్నారని, ప్రారంభోత్సవం అనంతరం బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. పెద్ద ఎత్తున కార్మికవర్గం సభకు హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు. అనంతరం గుర్తింపు సంఘం అధ్యక్షుడు వెంకట్రావు మాట్లాడుతూ.. సింగరేణి కార్మికులకు ఏ ముఖ్యమంత్రి చేయనంత మేలు కేసీఆర్ చేశారన్నారు. జాతీయ సంఘాలు పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలను కేసీఆర్ నేడు తిరిగి ఇప్పిచ్చారన్నారు. రూ.10లక్షల ఇంటి రుణానికి వడ్డీ చెల్లింపులు, లాభాల్లో 30శాతం వాటా, విద్యుత్ బిల్లులు రద్దు, క్వార్టర్లకు ఏసీ సౌకర్యం వంటి అనేక హక్కులు, సదుపాయాలు కల్పించారన్నారు. కావున కేసీఆర్ సభకు కార్మికవర్గం అంతా కదిలి రావాలన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు అన్నయ్య, మంద మల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# ఇంటింటా ఇళ్ల పట్టాల పంపిణీ



ఇంటి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 28, 34వ వార్డులో మంగళవారం ఇంటింటా ఇళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటి పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటికి పట్టా ఇచ్చి యాజమాన్యపు హక్కు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ఇళ్ల పట్టాలతో పుర ప్రజలు ఇక సంతోషంగా జీవించవచ్చని సూచించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కౌన్సిలర్లు సరిత, లక్ష్మి, అశోక్, నాయకులు సత్యనారాయణ, విజయ్, కిరణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెద్దనపల్లి బస్తీకి చెందిన కడారి చంద్రయ్య సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా, మంజూరైన రూ.38వేల చెక్కును అతడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

# శిథిలావస్థలో పశువైద్యశాల..!

- విధుల నిర్వహణకు, సామగ్రి భద్రపర్చేందుకు సిబ్బంది సతమతం
- పట్టించుకోని అధికారులు



కూలడానికి సిద్ధంగా పశువుల ఆసుపత్రి భవనం



వరండాలో ఉన్న సామగ్రి

తాండూర్: మూగజీవాలకు వైద్యసేవలు అందించే పశువైద్యశాల దీన స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఏళ్లు గడుస్తున్నా రూపురేఖలు మారడం లేదు. అసలు ఆ వైద్యశాల గురించి పట్టించుకునే వారే కరువయ్యారనే విమర్శలు వస్తున్నాయి. అధ్వానంగా తయారైన పశువైద్యశాలలో సరిగా విధులు నిర్వర్తించలేక, సామగ్రిని కాపాడలేక సిబ్బంది తీవ్రంగా సతమతమవుతున్నారు. పట్టించుకోవాల్సిన పాలకులు, ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో, పశువైద్యశాల ప్రగతికి నోచుకోకుండా పోతోంది. తాండూర్ మండలపరిధిలో తాండూర్, రేచినీ గ్రామాల్లో పశువైద్యశాలలు ఉన్నాయి. వీటిలో రేచినీ పశువైద్యశాలకు పదేళ్ల క్రితం పక్కా భవనం మంజూరు కాగా, తాండూర్ పశువైద్యశాలను మాత్రం తీవ్ర నిరాదరణకు గురి చేస్తున్నారు. దశాబ్దాల క్రితం తాండూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేశారు. నేటికీ అక్కడనే కొనసాగుతోంది. రేకులతో నిర్మించిన పశువైద్యశాల భవనం, ఏటా మరమ్మతు చేయక శిథిలావస్థకు చేరింది.

**కూర్చునే వీలు లేక..**

పశువైద్యశాలలో సరిగా కూర్చునే వీలు కూడా లేకుండా ఉంది. సరిపడా స్థలం లేకపోవడంతో సిబ్బంది అతికష్టంగా విధులు నిర్వర్తిస్తున్నారు. రెండు ఫ్రీజర్లు, మైక్రోస్కోప్‌తో పాటు పరీక్షలు నిర్వహించే పలురకాల లాబరేటరీ పరికరాలు, కంప్యూటర్, కృత్రిమ గర్భధారణకు సంబంధించిన పరికరాలు, గొర్రెల పంపిణీ పథకానికి సంబంధించిన తదితర విలువైన పరికరాలు, మందులు, వస్తు సామగ్రిని శిథిలమైన భవనంలోనే భద్రపర్చాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మరో మార్గం లేక ఇరుకిరుకుగా ఉన్న వరండాలో భద్రపరుస్తున్నారు.

**ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా..**

మండలంలో 12గ్రామపంచాయతీలు తాండూర్ పశువైద్యశాల పరిధిలోకి వస్తాయి. వీటి పరిధిలో 15వేల వరకు ఆవులు, గేదెలు, మరో 12వేల వరకు మేకలు, గొర్రెలు ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రోజువారీగా పశువైద్యశాలలో 20పశువులకు పైగా వైద్యసేవలు అందిస్తున్నారు. సీజనల్ సమయంలో ఆ సంఖ్య రెట్టింపుగా ఉంటుంది. అంతటి ప్రాధాన్యత కలిగిన పశువుల వైద్యశాలపై అటు పాలకులు, ఇటు ప్రభుత్వాధికారులు శీతకన్ను ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతులు ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టింపు చేయడం లేదు. ఇప్పటికైన చిత్తశుద్ధిని ప్రదర్శించి వైద్యసిబ్బందికి, వస్తుసామగ్రి, మందులు భద్రపరచడానికి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పశువైద్యశాలకు పక్కా భవనం మంజూరు కోసం తగినన్ని నిధులు మంజూరు చేయాలని ఏటా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. ప్రతిపాదనలు చేసి పంపిస్తున్నాం. కానీ నిధులు మంజూరు కావడం లేదు. గ్రామపంచాయతీ ఆదీనంలోని కమ్యూనిటీ హాల్‌ను తాత్కాలికంగా వాడుకునేందుకు అనుమతి ఇచ్చారు. కానీ పక్కా భవనం ఎప్పుడు నిర్మాణం అవుతుందనేది తేలకుండా ఉంది.

\- ఎం.భూమయ్య, పశు వైద్యాధికారి

# చెరువుల పండుగ విజయవంతం చేయండి



పెర్కపల్లిలో చెరువును పరిశీలిస్తున్న ఎంపీడీవో

బెల్లంపల్లిరూరల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8న నిర్వహించే ఊరూరా చెరువుల పండుగను ఘనంగా నిర్వహించాలని ఎంపీడీవో రాజేందర్ అన్నారు. మండలంలోని పెర్కపల్లి, ఆకెనపల్లిలో వేడుకలు నిర్వహించే చెరువులను పరిశీలించి, స్థానికులకు పలు సూచనలు చేశారు. చెరువుల వద్ద బోనాలు, బతుకమ్మ సంబురాలు, వంటావార్పు కార్యక్రమాలు చేపట్టి వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పద్మావతి, ఉమాదేవి, ఎంపీటీసీ సుభాష్‌రావు, పంచాయతీ కార్యదర్శులు వీరబాబు, శ్రీనివాస్, నాయకులు అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీలో ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. సీవోఈలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రభుత్వం నుంచి మంజూరైన పాఠ్య, నోట్ పుస్తకాలను ప్రిన్సిపాల్ ఐనాల సైదులు విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలు అదిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు దాగం మహేష్, కార్యదర్శి సరిత, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్, ఉపాధ్యాయులు శ్రీరామ, రమేష్, లక్ష్మీ నారాయణ, రాజేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా మట్టి దందా..?



మొరం తవ్వకాలు జరిపిన చెరువు

బెల్లంపల్లిరూరల్: మండలంలో మట్టి దందా జోరుగా సాగుతోంది. రాత్రి పగలు అడ్డూఅదుపు లేకుండా చెరువులు, వాగులు, వంకలను ఇష్టారీతిన తోడేస్తూ కాసులు దండుకుంటున్నారు. అధికారుల నిర్లక్ష్యమో లేక మట్టి దందా పై ×మాములు×గా వ్యవహరించడమో కానీ మట్టిదందాకు అడ్డుకట్టు పడడం లేదు. మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధి లక్ష్మీపూర్ గ్రామ శివారులోని బొక్కలగుంట చెరువులో కొందరు నాయకులు వారంరోజుల నుంచి రాత్రి పూట ఎక్స్‌కవేటర్ ద్వారా మట్టి, మొరం తవ్వకాలు జరిపి స్థానిక కట్టాడాలకు, ఇతర ప్రాంతాలకు తరలింపు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మట్టి, మొరం తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై బెల్లంపల్లి మండల ఇరిగేషన్ ఏ.ఈ ప్రణీత్‌ను వివరణ కోరగా.. మట్టి తవ్వకాల అనుమతి కోసం గ్రామానికి చెందిన ఓ నాయకుడు, మరి కొందరు తమకు దరఖాస్తు చేసుకోగా దానిని తిరస్కరించినట్లు తెలిపారు. అనుమతి లేకుండానే రాత్రిపూట మట్టి, మొరం తవ్వకాలు, తరలింపు జరుపుతున్నారని సమాచారం అందడంతో రెండు రోజుల క్రితం పనులను నిలిపివేసి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇకపై మొరం, మట్టి తవ్వకాలు జరిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.